# డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల మిగులు పనులు పూర్తి చేయాలి



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, లబ్ధిదారులు

- బీఆర్ఎస్, లబ్ధిదారుల ఆధ్వర్యంలో ధర్నా
- మంత్రి పొన్నం స్పందించక పోవడంతో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం

హుస్నాబాద్, జూన్ 14: హుస్నాబాద్ పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల మిగులు పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ లబ్ధిదారులు, బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో హుస్నాబాద్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు 90శాతం పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించడం జరిగిందన్నారు. మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయాల్సి ఉండగా కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పనులు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నదని ఆరోపించారు. సుమారు 300 మంది లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. అద్దె ఇండ్లల్లో ఉంటూ జీవనం వెల్లదీస్తున్న నిరుపేదల కోసం మంత్రి కనీసం దృష్టి సారించకపోవడం అన్యాయమన్నారు. పలుమార్లు మంత్రికి, అధికారులకు వినతిపత్రం అందజేసినా పట్టించుకోకపోవడంతో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గందె చిరంజీవి, కందుకూరి సతీశ్, బత్తుల జీవన్, ఉల్లెంగుల రాజు, లబ్ధిదారులు పున్న లక్ష్మి, ప్రియ, జేరిపోతుల సునీత, పద్మ తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, లబ్ధిదారులు

నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I హైదరాబాద్, శనివారం 15 జూన్ 2024 SANGAREDDY

## పెండింగ్ ధరణి సమస్యలు పరిష్కరించాలి

మెదక్, జూన్ 14(నమస్తే తెలంగాణ): ప్రత్యేక కార్యాచరణతో పెండింగ్ ధరణి సమస్యలను పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి సీసీఎల్ఏ కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల పరిష్కారానికి మరోసారి ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తులను రివ్యూ చేసుకోవాలని, అధికంగా పెండింగ్ ఉన్న మండలాలకు అవసరమైన అదనపు సిబ్బంది కేటాయించాలన్నారు. ధరణి వెబ్‌సైట్‌కు సంబంధించి డిజిటల్ సంతకాల ప్రక్రియలో మార్పులు చేస్తున్నామని, కొన్ని సమస్యలు తహసీల్దార్ స్థాయిలో, మరికొన్ని సమస్యలు రెవెన్యూ డివిజన్ అధికారి, మరికొన్ని సమస్యలు కలెక్టర్ స్థాయిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సీఎం ఆదేశాల మేరకు ప్రతి మంగళ, శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజావాణిలో వచ్చే భూ సంబంధిత సమస్యలను సైతం కలెక్టర్లకు బదిలీ చేస్తారని, వీటిని ప్రాధాన్యతతో సత్వర పరిష్కారం జరిగేలా చూడాలని కమిషనర్ ఆదేశించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మెదక్ ఆర్డీవో రమాదేవి, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, ఏవో యూనస్, తాహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

# రైతుల నిలువు దోపిడీ

## రైస్‌మిల్లర్లు, అధికారుల కుమ్మక్కుతో అన్నదాతలకు తప్పని ఇబ్బందులు

- నెల రోజులైనా పడని ధాన్యం డబ్బులు
- సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో రూ. 45 కోట్లు పెండింగ్
- నెల రోజులుగా రైతులను తిప్పుతున్న బెజ్జంకి అపర్ణ రైస్‌మిల్ యజమానులు
- డబ్బులు ఇప్పించాలని రైతుల విజ్ఞప్తి

సిద్దిపేట, జూన్ 14(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఆరుగాలం కష్టపడి పండించిన రైతులకు మిల్లర్లు, సివిల్ సప్లయ్ అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. మిల్లర్లు, అధికారులు కలిసి రైతులను నిలువునా దోపిడీ చేస్తున్నారు. ధాన్యం విక్రయించి నెల రోజులు అవుతున్నా డబ్బులు మాత్రం ఇంతవరకు రైతుల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లో జమ కాలేదు. ఎందుకు ఆలస్యమవుతుంది అని అడిగితే మీ దిక్కున్న చోట చెప్పుకోండి..మేం వేసేటప్పుడే వేస్తాం అంటూ రైతులను కొంతమంది మిల్లర్లు బెదిరిస్తున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదు. ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదని రైతులు వాపోతున్నారు. అధికారులు, మిల్లర్లు కుమ్మక్కై లారీలు లోడింగ్ సమయంలో ఒకటి రాస్తారు. మిల్లుల వద్ద దిగుమతి చేసుకునేటప్పుడు మరోటి రాసి అందినకాడికి దోచుకుంటున్నారు. ఫలితంగా రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. కొనుగోలు సమయంలో అకాల వర్షంతో ధాన్యం కొంత తడవడంతో తడిసిన ధాన్యం, మంచి ధాన్యానికి ఒక్కదాని కింద లెక్క కట్టి ట్రక్ షీట్ రాస్తున్నారు. గ్రేడ్ ఏ, గ్రేడ్ బీ అని రెండు రకాలుగా ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులను ఇబ్బంది పెడుతున్నారు.

### నెల రోజులుగా తిరుగుతున్న రైతులు

మెదక్ జిల్లా హవేళీఘనపూర్ మండలం మద్దులవాయి (ముత్తాయికోట) గ్రామానికి చెందిన ఎనిమిది మంది రైతులు గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి మే మాసంలో ధాన్యాన్ని తీసుకొచ్చారు. 709 బస్తాల (283 క్వింటాళ్ల 60 కిలోలు) ధాన్యాన్ని మే 12వ తేదీన కాంటా చేసి లారీలో లోడింగ్ చేసి సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని అపర్ణ రైస్ మిల్లుకు అటాచ్ చేశారు. ఆ ధాన్యాన్ని తీసుకోవడానికి మిల్లర్లు నానా ఇబ్బంది పెట్టారు. ఆ రోజు ధాన్యం తీసుకోకపోవడంతో ఆరు రోజులపాటు రైస్ మిల్లు వద్దనే లారీ ఉండిపోయింది. ఎట్టకేలకు మే 23వ తేదీన అపర్ణ రైస్‌మిల్లులో దిగుమతి చేసుకున్నారు. ఆ ధాన్యానికి ఏ గ్రేడ్‌గా కాకుండా ఒకరిద్దరి ధాన్యం సరిగా లేదని మొత్తం కామన్ కింద రాసుకొని అపర్ణ రైస్‌మిల్లు వాళ్లు దిగుమతి చేసుకున్నారు. కానీ ధాన్యం బాగున్నప్పటికీ అందరివి కామన్ కింద ఎలా రాస్తారు అని రైతులు అడిగ్గా కామన్ అయితేనే దించుకుంటాం లేకపోతే దించుకోం అంటూ బెదిరించాడు. అపర్ణ రైస్ మిల్లు యాజమాన్యం ఇలా చేయడం వల్ల చాలా నష్ట పోయామని, మాకు ఏ గ్రేడ్ కిందనే ఇవ్వాలి అని రైతులు వాదిస్తున్నారు. నెల రోజుల నుంచి పంచాయతీ నడుస్తునే ఉంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించడానికి చొరవ చూపడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఒక వైపు వర్షాలు పడుతున్నాయి. విత్తనాలు ఎరువులు కొనుక్కుందాం అంటే చేతిలో చిల్లి గవ్వలేదు. మరో వైపు అమ్ముకున్న ధాన్యం డబ్బులు రాకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, సివిల్ సప్లయ్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ధాన్యం డబ్బులు ఇప్పించాలని రైతులు మొర పెట్టుకుంటున్నారు. ఈ విషయమై సిద్దిపేట సివిల్ సప్లయ్ అధికారి హరీశ్‌ను వివరణ కోరగా, ఆ విషయం తమ దృష్టికి రాలేదని, మెదక్ డీఎంతో, రైస్‌మిల్లు యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.





### సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో రూ.45 కోట్లు పెండింగ్

యాసంగిలో ధాన్యం కొనుగోలు చేసిన డబ్బులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో సుమారుగా రూ.45 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. సిద్దిపేట జిల్లాలో 76,990 మంది రైతుల నుంచి 3,13,358 క్వింటాళ్ల ధాన్యాన్ని రూ. 690.30 కోట్లు పెట్టి కొనుగోలు చేశారు. వీటిలో రూ.680 కోట్లు రైతులకు చెల్లించారు. ఇంకా రూ.10.32 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంది. మెదక్ జిల్లాలో 68,600 మంది రైతుల నుంచి 2,84,153 క్వింటాళ్ల ధాన్యాన్ని రూ.625.99 కోట్లు పెట్టి కొనుగోలు చేశారు. ఇప్పటివరకు రూ.591.53 కోట్లు రైతులకు చెల్లించారు. ఇంకా రూ. 34.46 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉన్నది. వర్షాలు పడుతుండడంతో ఎవుసానికి రైతుల వద్ద డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారు. ధాన్యం డబ్బులు త్వరగా చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మే చివరి నాటికి ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసి, డబ్బులను సకాలంలో రైతులకు అందజేసి ఆదుకుంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు అన్ని కష్టాలే ఎదురవుతున్నాయి.

# విద్యతోనే బంగారు భవిష్యత్



విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

- విద్యార్థులు శ్రద్ధతో చదివి ప్రయోజకులు కావాలి
- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి
- విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించిన కలెక్టర్
- మెరుగైన విద్యనందించాలని ఉపాధ్యాయులకు ఆదేశం

కంది, జూన్ 14: విద్యతోనే చక్కటి భవిష్యత్ ఉంటుందని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శ్రద్ధతో చదివి ప్రయోజకులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. బడిబాటలో భాగంగా శుక్రవారం కంది, కాశీపూర్, చెర్లగూడెం ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించిన సామూహిక అక్షరాభ్యాసంలో కలెక్టర్ పాల్గొని విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. బాడిబాటలో పెరిగిన విద్యార్థుల సంఖ్యను, పాఠశాలల్లో సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం బడిబాటను నిర్వహిస్తుందన్నారు. మెరుగైన విద్యను అందిచాలన్న ఉద్దేశంతో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కమిటీల ద్వారా పనులు చేపట్టి ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో పనులతో పాటు విద్యార్థులకు యూనిఫామ్స్‌లను మహిళా సంఘాల ద్వారా కుట్టించే ఏర్పాటు చేశామని, పాఠశాల పనుల్లో అందరినీ భాగస్వామ్యం చేయాలన్నదని ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అన్ని వసతులతో నాణ్యమైన బోధన జరుగుతున్నందున ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలలకు పంపించాలని కోరారు. విద్యార్థులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అంతకుముందు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో నర్సింహగౌడ్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఏడు నెలలైనా జీతాలివ్వరా!

## ‘పేట’ తహసీల్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికుల ఆందోళన



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకురాలు బాలమణి

రామాయంపేట, జూన్ 14: ఏడు నెలలు గడిచినా పంచాయతీ కార్మికులకు జీతాలు ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీఐటీయూ నాయకురాలు బాలమణి అన్నారు. శుక్రవారం పంచాయతీ కార్మికులతో కలిసి రామాయంపేట తహసీల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి తహసీల్దార్ రజినీకుమారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం బాలమణి మాట్లాడుతూ ఏడు నెలలుగా కార్మికులకు జీతాలివ్వడంతో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పొద్దనక, రాత్రనక గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు పనిచేస్తుంటే వారికి జీతాలివ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేయడం తగదన్నారు. కార్మికులకు జీతాలు లేక వారి కుటుంబాలు పస్తులుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కార్మికులకు జీతాలిచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం జీతాలివ్వకుంటే పంచాయతీ కార్మికులతో గ్రామ పంచాయతీలను ముట్టడిస్తామని హెచ్చరించారు.

# మొర్గి బ్రిడ్జికి మోక్షమెప్పుడో!

- రెండేండ్లుగా పూర్తికాని పనులు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు



సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలంలో మధ్యలో ఆగిపోయిన మొర్గి బ్రిడ్జి పనులు

నాగల్‌గిద్ద, జూన్ 14: సంగారెడ్డి జిల్లా నాగల్‌గిద్ద మండలంలోని మొర్గి వాగుపై బ్రిడ్జి నిర్మాణ పనులు రెండేండ్లుగా పూర్తికావడం లేదు. పనులు పిల్లర్ల దశలోనే ఆగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాగుపై బ్రిడ్జి లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్థానిక ప్రజాప్రతినిధులు ఆనాటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కరసగుత్తి ప్రధాన రహదారి నుంచి షాపూర్ వరకు 5 కిలోమీటర్ల డబుల్‌లైన్ రోడ్డు నిర్మాణానికి రూ.5.54 కోట్లు మంజూరు చేయించారు. దీంతో పాటు మొర్గి సమీపంలో వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.6.32 కోట్ల నిధులు మంజూరు చేయించారు. రోడ్డు నిర్మాణం పూర్తికాగా, నిబంధనల ప్రకారం ఆరునెలల్లో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. కానీ, రెండేండ్లు పూర్తవుతున్నా నేటికి బ్రిడ్జి పూర్తికాక ప్రయాణానికి ఇబ్బందులు తప్పడం లేదు. నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి కర్ణాటకలోని బీదర్ జిల్లాకు రాకపోకలు కొనసాగించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం పీఎంజీఎస్‌వై నిధులు రూ.6.32 కోట్లు మంజూరు చేసింది. బ్రిడ్జి పనులకు 2022 మార్చి 6న శంకుస్థాపన చేశారు. పనులు ఎందుకు ఆగిపోయాయో తెలియడం లేదు. ప్రస్తుతం పిల్లర్ల దశలోనే పనులు ఆగిపోయాయి. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా నిర్మాణ పనులు చేపట్టి తీవ్రజాప్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ బ్రిడ్జి పూర్తయితే నారాయణఖేడ్ ప్రాంత ప్రజలకు కర్ణాటకలోని బీదర్‌కు వెళ్లే దూరం తగ్గడంతో పాటు ఈ ప్రాంత ప్రజలకు రవాణా కష్టాలు తీరుతాయి. ఇప్పటికైనా ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు స్పందించి బ్రిడ్జి పనులు పూర్తయ్యేలా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం..



రెండేండ్లుగా వంతెన పనులు పూర్తికాక రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పనులు మధ్యలో నిలిచిపోవడంతో మొర్గిలో మోడల్ పాఠశాల, కళాశాల ఉండడంతో పాటు కర్ణాటకలోని బీదర్ జిల్లాకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉంది.ఈ మార్గంలో రోజు వందలాది వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. పెద్దసార్లు పట్టించుకొని తొందరగా వంతెన నిర్మాణం పూర్తిచేస్తే సౌకర్యంగా ఉంటుంది.
– నందుపాటిల్, మొర్గి

# పంట రుణాలకు రైతుల ఎదురుచూపు

## సంగారెడ్డి జిల్లాలో ఖరారుకాని వార్షిక రుణ ప్రణాళిక

- సాగు ప్రారంభమైనా అందని రుణాలు
- అవస్థలు పడుతున్న రైతులు
- రైతుల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం

సంగారెడ్డి, జూన్ 14(నమస్తే తెలంగాణ): వానకాలం సీజన్ ప్రారంభమైనా రైతుల చేతిలో పైకం లేదు. ప్రభుత్వం రైతుబంధు స్థానంలో రైతుభరోసా పేరుతో పెట్టుబడి సాయం అందిస్తామని ప్రకటించినా ఇప్పటివరకు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయలేదు. దీనికితోడు ప్రభుత్వం రుణమాఫీ చేయడం లేదు. దీంతో రైతులు ప్రభుత్వం తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాగు కోసం రైతులు బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకునేందుకు వీలుంది. సంగారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు వార్షిక రుణ ప్రణాళిక ఖారారు కాలేదు. దీంతో బ్యాంకర్లు రైతులకు పంట రుణాలు మంజూరు చేయలేని పరిస్థితి నెలకొంది. రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొన్నది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లా యంత్రాంగం, బ్యాంకర్లు సంయుక్తంగా వార్షిక రుణ ప్రణాళికను ప్రకటించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు వార్షిక రుణ ప్రణాళికను ప్రకటించలేదు. ఏటా మే మాసంలోనే బ్యాంకర్లు, జిల్లా యంత్రాంగం వార్షిక రుణ ప్రణాళికను ప్రకటిస్తుంది. ఎన్నికల కోడ్ పేరుతో ఈ ఏడాది 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక రుణ ప్రణాళిక రూపకల్పన, ప్రకటనలో జాప్యం జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ఎన్నికల కోడ్ ముగిసినా ఇప్పటి వరకు ఇంకా వార్షిక రుణ ప్రణాళికను ప్రకటించలేదు. దీంతో బ్యాంకర్లు, జిల్లా యంత్రాంగం తీరుపై రైతులు, రైతు సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.



### వందశాతం పంట రుణాలు ఇవ్వని బ్యాంకర్లు

రైతులకు పంట రుణాలు ఇవ్వటంలేదు బ్యాంకర్లు ఆసక్తిని చూపటం లేదు. ఏటా లీడ్ బ్యాంకు రైతులకు ఇవ్వాలిన పంట రుణాలకు సంబంధించి వార్షిక రుణ ప్రణాళికలో బ్యాంకుల వారీగా లక్ష్యాలను నిర్ధేశిస్తారు. సంగారెడ్డి జిల్లాలోని బ్యాంకర్లు లక్ష్యం మేరకు వందశాతం పంటరుణాలు ఇవ్వటం లేదు. పంట రుణాలను ఎక్కువగా బ్యాంకు ఖాతాల్లోనే సర్దుబాటు(రెన్యువల్) చేస్తున్నారు తప్ప కొత్త రుణాలు ఇవ్వకపోవటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. 2023–2024 ఆర్థిక సంవత్సరానికి వానకాలం, యాసంగి సీజన్‌లో రూ.2,725 కోట్ల పంట రుణాలు రైతులకు ఇవ్వాల్సి ఉండగా రూ.2,505 కోట్ల పంట రుణాలు మాత్రమే ఇచ్చారు. లక్ష్యం మేరకు వందశాతం పంటరుణాలు ఇవ్వలేదు. వానకాలం సీజన్‌లో రూ.1635 కోట్లు లక్ష్యంగా కాగా బ్యాంకర్లు 1,00,639 మంది రైతులకు రూ.1302 కోట్ల రుణాలు ఇచ్చారు. యాసంగి సీజన్‌లో రూ.1090 కోట్ల పంట రుణాలు ఇవ్వాల్సి ఉంది. 78,683 మంది రైతులకు రూ.1203 కోట్ల పంట రుణాలు ఇచ్చారు. ఏపీజీవీబీ, కెనరా బ్యాంకు మినహా ఇతర బ్యాంకులు లక్ష్యం మేరకు పంట రుణాలు ఇవ్వలేదు.

### వార్షిక రుణ ప్రణాళిక ప్రకటించాల్సి ఉన్నా..!

వానకాలం సీజన్ ప్రారంభానికి ముందే వార్షిక రుణ ప్రణాళిక ప్రకటించాల్సి ఉంది. కానీ సంగారెడ్డి జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వార్షిక రుణ ప్రణాళికను ఇంకా ప్రకటించలేదు. లీడ్ బ్యాంకు నూతన ఆర్థిక సంవత్సరం ఆరంభంలోనే వార్షిక రుణ ప్రణాళికను సిద్ధం చేస్తుంది. జిల్లా కలెక్టర్ అనుమతితో ప్రతి ఏటా మేలోనే వార్షిక రుణ ప్రణాళికను ప్రకటిస్తారు. వార్షిక రుణ ప్రణాళికలో పేర్కొన్న లక్ష్యాలకు అనుగుణంగా జిల్లాలోని బ్యాంకర్లు పంటరుణాలు, ఇతర రుణాలు మంజూరు చేస్తారు. ఎన్నికల కోడ్ కారణంగా వార్షిక రుణ ప్రణాళిక ప్రకటనలో జాప్యం జరిగినట్లు చెబుతున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.7800 కోట్లతో వార్షిక రుణ ప్రణాళికను ప్రకటించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024–25కు సంబంధించి లీడ్ బ్యాంకు సుమారు రూ.9వేల కోట్లతో వార్షిక రుణ ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలుస్తుంది. ఇందులో పంటరుణాలకు సంబంధించి రూ.3వేల కోట్ల లక్ష్యం నిర్దేశించుకున్నట్లు సమాచారం. వార్షిక రుణ ప్రణాళిక సిద్ధంగా ఉన్నప్పటికీ జిల్లా యంత్రాంగం బ్యాంకర్లతో సమావేశం నిర్వహించాల్సి ఉంది. అయితే జిల్లా యంత్రాంగం బ్యాంకర్లతో సమావేశం నిర్వహించడంలో జాప్యం చేస్తుంది. దీంతో వార్షిక రుణ ప్రణాళిక ఖరారు కావటం లేదు. రైతులు పంట రుణాల కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో వెంటనే వార్షిక రుణ ప్రణాళికను ప్రకటించాలని రైతులు, రైతు సంఘాలు నేతలు జిల్లా యంత్రాంగాన్ని, బ్యాంకర్లను కోరుతున్నారు.

# ఫ్యాక్టరీ పనులు త్వరగా పూర్తిచేయాలి

- సిద్దిపేట జిల్లాలో మొదలైన ఆయిల్‌పామ్ పంట దిగుబడి
- ఫ్యాక్టరీ నిర్మాణ పనులను వేగిరం చేయాలి
- సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులు పరిశీలిస్తున్న సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

నంగునూరు, జూన్ 14: సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులను త్వరగా పూర్తి చేయాలని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం రూ.300 కోట్లతో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయిల్‌ఫెడ్ అధికారులు ఫ్యాక్టరీ మ్యాప్‌ను, నిర్మాణ దశలను కలెక్టర్‌కు వివరించారు. నిర్మాణ పనులు మందకొడిగా సాగుతుండడంపై అసహనం వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులు, గుత్తేదారులకు సూచించారు. జిల్లాలో ఆయిల్‌పామ్ దిగుబడి మొదలవుతున్న క్రమంలో ఫ్యాక్టరీ నిర్మాణం త్వరగా పూర్తి చేస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి సువర్ణ, ఆయిల్ ఫెడ్ అధికారులు పాల్గొన్నారు.

### అదనపు గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

సిద్దిపేట, జూన్ 14 : సిద్దిపేట పరిధిలోని గుండ్లచెరువు ప్రాథమిక పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ మనుచౌదరి, విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం గుండ్ల చెరువు ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండ్లచెరువు పాఠశాలలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించేనాటికి 40 మంది విద్యార్థులు ఉండేవారని, తర్వాత వారి సంఖ్య 200లకు పెరగడంతో తాత్కాలికంగా పాఠశాల భవనాన్ని ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులకు సరిపడా అదనపు తరగతుల నిర్మాణం కోసం పాఠశాల ఆవరణలో ఉన్న ఖాళీ స్థలంలో అదనపు గదులు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని సెక్టోరియల్ అధికారి రామస్వామి, ఎంఈవో యాదవరెడ్డిలను ఆదేశించారు.